క్లుప్తంగా

ఉపాధి హామీ మేట్లకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ మస్తాన్‌వలి

కొమరోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం మేట్లకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేట్ల విధులు, బాధ్యతలు, కూలీలకు హాజరువేసే విధానం, ఎన్ఎంఎంఎస్ యాప్ పనితీరు, మస్టర్ నిర్వహణ, మార్కింగ్ గురించి ఎంపీడీఓ మస్తాన్‌వలి వివరించారు. రోజూ ఒక్కో కూలీకి 300 రూపాయలు ఎలా గిట్టుబాటు అవుతుందో తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఓ మహాలక్ష్మి, ఈసీ కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ పరిహారానికి దరఖాస్తుల ఆహ్వానం

కంభం: కేంద్ర ప్రభుత్వం అందించిన ఈ-శ్రమ్ కార్డు పొంది 2021 ఆగస్టు 31 నుంచి 2022 మార్చి 31 మధ్య మరణించిన, పూర్తి అంగవైకల్యం బారిన పడిన వారు రూ.2 లక్షల పరిహారం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సహాయ కార్మిక శాఖాధికారి బాలకాశి సూచించారు. ఈ నెల 31వ తేదీలోగా కార్మిక శాఖ కార్యాలయం, వెలుగు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిత్రకారులకు ఘన సన్మానం



చిత్రకారులను సన్మానిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కంభం: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన పలువురు చిత్రకారులను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం కంభంలో ఘనంగా సన్మానించారు. కంభం ప్రాంతంలోని పలువురు చిత్రకారులు అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు పొందడం గర్వకారణమని వక్తలు కొనియాడారు. నేషనల్ అవార్డు గ్రహీత డాక్టర్ వజ్రగిరి జస్టిస్, పఠాన్ ఖాసిం, ఎం.రాజశేఖరరాజు, వెంకట్, శేఖర్, విజయ్ తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అడ్వకేట్ మల్లికార్జున, కొత్తపల్లి విజయ్‌కుమార్, యోబు, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించండి




ఎంపీపీని సన్మానిస్తున్న డీఎల్‌డీఓ, ఎంపీడీఓ తదితరులు

మార్కాపురం: మార్కాపురం మండల అభివృద్ధికి అధికారులు సహకరించాలని నూతన ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన బండి లక్ష్మీదేవి కోరారు. ఎంపీపీగా ఎన్నికైన సందర్భంగా ఆమెను గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, డీఎల్‌డీఓ కె.శ్రీనివాసరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సిబ్బంది జనార్దనరెడ్డి, హర్ష తదితరులు సన్మానించారు. అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని అధికారులు పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం టౌన్: పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన మార్కాపురం మండలం రాయవరం పంచాయతీ కార్యదర్శి ఎస్ మోహన్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల పంచాయతీ కార్యదర్శులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జమ్మనపల్లి పంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా దరిమడుగు పీఎస్ టి.వి జయలక్ష్మి, కోశాధికారిగా చింతగుంట్ల పీఎస్ బి శ్రీహరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ సలీమ్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం మాజీ ధర్మకర్త, వైఎస్సార్ సీపీ నేత నాలి కొండయ్య యాదవ్ గురువారం కొండేపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని 20వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ షేక్ సలీమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండయ్య యాదవ్‌ను అభినందించారు. అలాగే పట్టణంలోని ఎస్‌సీవీకే నిలయం, రీడింగ్ రూమ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మంచినీటి చలివేంద్రాన్ని ఆ సంస్థ సెక్రటరీ గుంటక సుబ్బారెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ ఐ.బాల సుబ్బారావు ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆడా మేమే.. ఈడా మేమే!

లైసెన్స్‌డ్ దుకాణాల నుంచి నేరుగా బెల్టు షాపులకు చేరుతున్న మద్యం

- పల్లెల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయం
- అన్ని వేళలా అందుబాటులో ఉండటంతో మత్తులోనే జోగుతున్న మందుబాబులు
- కుటుంబాల్లో మద్యం చిచ్చు రాజేస్తోందని మహిళల ఆందోళన
- పొదిలి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 30 కేసులు నమోదు



సీజ్ చేసిన మద్యాన్ని చూపుతున్న పోలీసులు

పొదిలి:

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న సామెతను తు.చ తప్పకుండా పాటిస్తున్నారు అధికార కూటమి నాయకులు. ధనార్జనే ధ్యేయంగా పల్లెలు, పట్టణాల్లో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. మద్యం దుకాణాలకు లైసెన్స్ పొందిన వ్యక్తులే బెల్ట్ షాపుల నిర్వహణను ప్రోత్సహిస్తూ అదనపు ఆదాయం కోసం అర్రులు చాస్తున్న తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పొదిలి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బెల్ట్ షాపులపై ఉక్కు పాదం మోపుతున్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. విచ్చలవిడిగా కొనసాగుతున్న మద్యం బెల్ట్ షాపులు ఎక్సైజ్ అధికారుల ఉదాసీనతను వెక్కిరిస్తున్నాయి. పొదిలి, కొనకనమిట్ల మండలాల్లో లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలు 10 ఉన్నాయి. వీటికి అనుబంధంగా రెండు మండలాల్లో 60కి పైగా బెల్టు షాపులు నిర్వహిస్తుండటం గమనార్హం. పొదిలి పట్టణంలోని ఒంగోలు రోడ్డు, దర్శి రోడ్డులో 10 బెల్టు షాపులు నిర్వహిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. ఎక్సైజ్ అధికారులు మాత్రం గత కొద్ది కాలంగా బెల్ట్ షాపులు లేవు లేవంటూనే.. 30 వరకు కేసులు నమోదు చేశారు. ఇటీవల ఒక వాహనంలో సుమారు రూ.1.50 లక్షల విలువైన మద్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు సీజ్ చేయడంతో బెల్ట్ షాపులు ఏ రకంగా నిర్వహిస్తున్నారో తేటతెల్లమైంది.

ఎక్సైజ్ సిబ్బంది సహకారంతోనే..

ఏ లైసెన్స్ దుకాణం నుంచి ఏ బెల్టు షాపులకు సరుకు చేరవేయాల్లో ఎక్సైజ్ సిబ్బందే దగ్గరుండి మరీ సర్దుబాట్లు చేస్తున్నట్లుగా ఆరోపణలు గుప్పుమంటున్నాయి. బెల్టు షాపుల్లో వ్యాపారాన్ని బట్టి స్టేషన్‌కు నెలవారీ మామూళ్లు ముట్టజెప్పేలా ఒప్పందాలు చేసుకున్నట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ బెల్ట్ షాపు నిర్వాహకుడు పేర్కొన్నాడు. ఈ అనధికారిక కప్పం కట్టని వారిపై కేసులు బనాయించి తమ దారిలోకి తెచ్చుకుంటున్నట్లు సమచారం.

విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తుండటంతో పచ్చటి పల్లెలో చిచ్చు రాజుకుంటోంది. తరచూ ఘర్షణలు, వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కాపురాలు గుల్లవుతున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ల సమీపంలో, జన సంచారం ఉన్న ప్రాంతంలో మందుబాబుల ఆగడాలతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వ్యక్తులు పూటుగా మద్యం తాగి రోడ్లపై దొర్లుతున్న దృశ్యాలు తరచూ దర్శనమిస్తున్నాయి.

> **30 మందిపై కేసులు నమోదు చేశాం**
>
> పొదిలి, కొనకనమిట్ల మండలాల్లో ఇప్పటి వరకు 30 మంది బెల్టు షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేశాం. వారి నుంచి 1,283 బాటిల్లు స్వాధీనం చేసుకున్నాం. ఒక బొలెరో వాహనం సీజ్ చేయడంతోపాటు మరో 30 మందిని బైండోవర్ చేశాం. చలానా రూపంలో రూ.12 వేలు వసూలు చేశాం. ఎక్కడా బెల్టు షాపు లేకుండా చర్యలు తీసుకుంటాం.
>
> – అరుణకుమారి, ఎక్సైజ్ సీఐ, పొదిలి

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం



ఆవుల శ్రీధర్‌రెడ్డి.



యేలం మురళీకృష్ణ.



రవికుమార్, కొమరోలు



మానం బాలిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బేస్తవారిపేట: గిద్దలూరు నియోజకవర్గంలోని బేస్తవారిపేట, కొమరోలు, రాచర్ల మండలాలు, గిద్దలూరు పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షులుగా పలువురిని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్టు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం పేర్కొంది.

బేస్తవారిపేట మండల అధ్యక్షుడిగా మోక్షగుండం గ్రామానికి చెందిన ఆవుల శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన భార్య ఆవుల అరుణమారి మోక్షగుండం సర్పంచ్‌గా సేవలందిస్తున్నారు. ఈయన కుటుంబ సభ్యులే మోక్షగుండం పంచాయతీకి ఏడు పర్యాయాలు సర్పంచ్‌గా సేవలు అందించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రీధర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

కొమరోలు: వైఎస్సార్ సీపీ కొమరోలు మండల అధ్యక్షుడిగా మేరుగ రవికుమార్ నియమితులయ్యారు. మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన రవికుమార్ గత ఏడేళ్లుగా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. రవికుమార్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా వెంకటరాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రవికుమార్‌ను జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు అభినందించారు.

రాచర్ల: వైఎస్సార్ సీపీ రాచర్ల మండల అధ్యక్షుడిగా మండలంలోని పలుగింటిపల్లె గ్రామానికి చెందిన యేలం మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రెండోసారి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గిద్దలూరు నగర అధ్యక్షుడిగా 13వ వార్డు కౌన్సిలర్ మానం బాలిరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం గిద్దలూరులోని ఆయన నివాసానికి వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలిరెడ్డి మాట్లాడుతూ.. తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. నగర పంచాయతీలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, నాసరి శ్రీను, పోలేపల్లె శివ, గర్రె చిరంజీవి, పాలుగుళ్ల నరసింహారెడ్డి, సూరేపల్లె రామకృష్ణ, గఫూర్, సునీల్‌రెడ్డి, నంద్యాల బాలు, గోడి వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, మిత్ర, బత్తుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ లక్ష్మీదేవికి ఘన సన్మానం



మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఎంపీపీ లక్ష్మీదేవిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మార్కాపురం: మార్కాపురం ఎంపీపీగా ఎన్నికైన బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డిని గురువారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, కుందురు వెంకటరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నారు బాపన్‌రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మార్కాపురం సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్సైలు అంకమరావు, సైదుబాబు బందోబస్తు నిర్వహించారు. సన్మాన కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, పోరెడ్డి చెంచిరెడ్డి, గొట్టిపడియ నాయకులు వేల్పుల చెన్నారెడ్డి, తుమ్మా వెంకటరెడ్డి, బొందలపాడు, ఇడుపూరు, తర్లుపాడు పార్టీ నాయకులు తుమ్మా వెంకటేశ్వరరెడ్డి, వెన్నా సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, పలువురు సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా రాంబాబు పర్యవేక్షణలో..

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ ముఖ్యనాయకులు గురువారం ఉదయం 10 గంటలకల్లా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణకు చేరుకున్నారు. అయితే పోలీసుల ఆంక్షలతో అన్నా రాంబాబు ఆర్అండ్‌బీ అతిథి గృహ ప్రాంగణానికి పార్టీ నాయకులతో కలిసి వెళ్లారు. అందరికీ మార్గనిర్దేశం చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని ఎంపీటీసీ సభ్యులకు సూచించారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు బండి లక్ష్మీదేవిని ఎంపీపీగా ఎన్నుకున్నారు. ఎన్నిక ముగిసిన అనంతరం పలువురు నాయకులు అన్నా రాంబాబును అభినందనలతో ముంచెత్తారు. ఎన్నికల ప్రక్రియను ఎంపీడీఓ శ్రీనివాసులు, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వి శ్రీనివాస్, సిబ్బంది పర్యవేక్షించారు.

మాజీ సైనికుల నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన మాజీ సైనికుల కార్యవర్గం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నియోజకవర్గ మాజీ సైనికుల జేఏసీ చైర్మన్‌గా కెప్టెన్ జి.సి.అంకన్న ఎన్నికయ్యారు. గురువారం మాజీ సైనికులు పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్లో సమావేశమై నూతన జేఏసీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్లుగా కోటారెడ్డి, సీహెచ్ లక్ష్మణ్‌బాబు, కన్వీనర్‌గా పసుపులేటి శ్రీనివాసులు, కో కన్వీనర్‌గా ఎస్.వెంకటేశ్వరరెడ్డి, సలహాదారుడిగా వేణుగోపాల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన జేఏసీ సభ్యులు మాట్లాడుతూ.. గిద్దలూరు నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘ సభ్యులు ఎస్.శ్రీనివాసులు, పుల్లయ్య, పోలయ్య, వెంకటయ్య, పి.గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

బేస్తవారిపేట: కూటమి పార్టీలు గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. గురువారం బేస్తవారిపేటలో సీపీఐ నియోజకవర్గ సమితి సమావేశం ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి డాకాల పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్హులైన పేదలకు నివేశన స్థలాలు, సాగు భూములు కేటాయించాలన్నారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. హామీలు నెరవేర్చకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కె.వెంకట రమణ, సహాయ కార్యదర్శి యు జోసఫ్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి యోగయ్య, నాయకులు ఏలం శ్రీనివాసులు, ఎం.కొండయ్య, జె.అంకయ్య పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు డ్రోన్ కెమెరా అందజేత



ఎస్సై నాగరాజుకు డ్రోన్ కెమెరా అందజేస్తున్న ముత్యాల సుబ్బారెడ్డి

కొమరోలు: స్థానిక పోలీస్ స్టేషన్‌కు మండలంలోని పురుషోత్తమునిపల్లె గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ డాక్టర్ ముత్యాల రామిరెడ్డి ఒక డ్రోన్ కెమెరా బహూకరించారు. రామిరెడ్డి సోదరుడు సుబ్బారెడ్డి డ్రోన్ కెమెరాను గురువారం ఎస్సై నాగరాజుకు అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ.. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాలను దాతల సహకారంతో సమకూర్చుకుంటున్నామని చెప్పారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు డ్రోన్ కెమెరా ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉపాధి హామీలో నిర్దేశించిన పనులు చేపట్టాలి

- డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



పొదిలి : సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

పొదిలి రూరల్: ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం నిర్దేశించిన పనులను మాత్రమే చేపట్టాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ గంగవరపు జోసఫ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న మూడు నెలల్లో ప్రభుత్వం సూచించిన పంచ ప్రాధాన్యత అంశాలను పూర్తి చేయాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా 225 రైత్వారీ కుంటలు, రెండో ప్రాధాన్యతగా కాలువల్లో పూడికతీత పనులు, మూడో ప్రాధాన్యతగా మంచినీటి, ఇరిగేషన్ చెరువుల్లో పూడికతీత పనులు, నాలుగో ప్రాధాన్యతగా పశువుల నీటి తొట్ల నిర్మాణం, చివరగా ఒక్కో వ్యక్తికి సరాసరి కూలి రోజుకు 290 రూపాయలు వచ్చే విధంగా పనులు చేయించాలన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ సకాలంలో పని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రామాణాలు పాటిస్తూ, మస్టర్‌లో తప్పులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ లలితకుమారి, ఎంపీడీఓ శోభన్‌బాబు, ఏపీఓ టి.వెంకట్రావు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

దైవమార్గంతో ప్రశాంత జీవనం



డాక్టర్ కనకదుర్గ, చంద్రమౌళికి ప్రసాదం అందజేస్తున్న బ్రహ్మకుమారీలు

మార్కాపురం టౌన్: ప్రతి ఒక్కరూ దైవమార్గంలో నడిస్తే ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతారని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్, ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ చప్పల్లి కనకదుర్గ పేర్కొన్నారు. ఉగాది సందర్భంగా బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలోని ఎస్ఎస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను ఆమెతోపాటు ఆర్టీసీ డీఎం నరసింహులు, ఎస్ఎస్ అగ్రికల్చర్, హార్టికల్చర్, లా కళాశాల కరస్పాండెంట్ నాదెళ్ల చంద్రమౌళి సందర్శించి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ కోశాధికారి రామడుగు రమేష్, బ్రహ్మకుమారీలు సరస్వతి, ప్రభ, మాధవి, సృజన తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



ఆర్ఐకి వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని ఆర్ఐ భాస్కర్‌రావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.అహరోన్ మాట్లాడుతూ.. గిద్దలూరు ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల ఇక్కడి విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందన్నారు. లక్షల రూపాయలు వెచ్చించి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య భారంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ విషయమై ఆలోచించి, జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు డి.తేజ, బి.ఈశ్వర్, అంజన్‌కుమార్, శశిధర్‌కుమార్, నవీన్, పవిత్రకుమార్ పాల్గొన్నారు.

ఆవుల యజమానులకు నష్టపరిహారం అందజేత



బాధితులకు చెక్కులు అందిస్తున్న అటవీశాఖ అధికారులు

మార్కాపురం: ఇటీవల మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, పెద్దారవీడు మండలంలోని గుండంచర్ల బీట్ పరిధిలో రేచు కుక్కల దాడిలో మృతి చెందిన ఆవులు, దూడల యజమానులకు అటవీశాఖ తరఫున నష్టపరిహారాన్ని గురువారం మార్కాపురం అటవీశాఖ అధికారి కార్యాలయంలో రేంజ్ ఆఫీసరు వరప్రసాద్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగరాజు అందించారు. అడవుల్లో వణ్యప్రాణుల వల్ల జంతువులకు గాయాలైనా, మృతి చెందినా తమకు సమాచారం అందిస్తే విచారణ చేపట్టి పరిహారం అందిస్తామని పేర్కొన్నారు. అటవీ అధికారుల అనుమతి లేకుండా అడవిలోకి ప్రవేశించడం, ఉచ్చులు, వలలు వేయడం, నిప్పు పెట్టడం లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొత్తం ఏడుగురు యజమానులకు రూ.2.48 లక్షల నష్టపరిహారం అందించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు టి.బాలాకుమారి, వెన్నా శేషిరెడ్డి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వడ్డీలో 50 శాతం రాయితీ



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ నారాయణరావు

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను ఒకేసారి చెల్లించే వారికి వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు కమిషనర్ నారాయణరావు పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి, వీధిలైట్లు, డ్రైనేజీ వ్యవస్థ, మెరుగైన పారిశుధ్యం కోసం నిధుల అవసరముందని, ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీకి పన్ను చెల్లించాలని కోరారు. ఉగాది, రంజాన్ పండగ రోజుల్లో కూడా పన్నుల చెల్లింపు కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మార్కాపురం మున్సిపాలిటీలో సుమారు రూ.10.54 కోట్ల ఆస్తి పన్నుకుగాను రూ.5.39 కోట్లు మాత్రమే వసూలైందని చెప్పారు. పన్నుల వసూలుపై సిబ్బందికి సూచనలిచ్చారు.


పాస్టర్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

కంభం: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానస్పద మృతిపై తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నేదరపల్లి జయరాజ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పాస్టర్ ప్రవీణ్ పగడాల తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొంతమూరు దివాన్ చెరువు సమీపంలో అనుమానస్పద స్థితిలో మృతి చెందారని, హెల్మెట్ ధరించి ఉన్న ఆయన ముఖంపై తీవ్రమైన గాయాలుండటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. క్రైస్తవ బోధకుడు ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

మార్కాపురం: రాజమండ్రిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ప్రముఖ పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష కార్యదర్శులు టి.ఇర్మియా, జె.జాన్ కోరారు. గురువారం సాయంత్రం పట్టణంలోని హెబ్రోను ప్రార్థనా మందిరంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రవీణ్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు దేవయ్య, మనోహర్, పీటర్ పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: పాస్టర్ పగడాల ప్రవీణ్ మరణంపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని పట్టణంలోని క్రైస్తవులు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలోని ఆర్ఐ భాస్కర్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. క్రైస్తవులపై సాగుతున్న అకృత్యాలపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘ నాయకులు జగన్‌పాల్, డి.అబ్రహాం, జి.శ్యామేలు, మనోజ్ కుమార్, మోజేసు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

'జార్జి' విద్యార్థులకు అభినందన




విద్యార్థులను అభినందిస్తున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం టౌన్: స్టేట్‌బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రీజనల్ టెక్ ఫెస్ట్‌లో ప్రతిభ చాటిన జార్జి పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులను మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అభినందించారు. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రశంసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఐఓటీ బేస్డ్ అగ్రికల్చర్, డిజిటల్ లిటరసీ అంశాలపై జార్జి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డాక్టర్ పి.సాధునాయక్ తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్

గిద్దలూరు రూరల్: ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న ఇసుక టిప్పర్ ఢీకొట్టిన సంఘటన గిద్దలూరు మండలంలోని శింగంపల్లె వద్ద గురువారం చోటుచేసుకుంది. గిద్దలూరు డిపో నుంచి ప్రయాణికులతో బయలుదేరిన ఆర్టీసీ బస్సును మార్గమధ్యంలో శింగంపల్లె వద్ద ఇసుక లోడుతో వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదం నుంచి అదృష్టవశాత్తు ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. కాగా, ప్రమాదం ధాటికి బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది.


క్రీడలతో మానసిక వికాసం



స్పోర్ట్స్ ఫెస్ట్ క్రీడాల్లో పాల్గొన్న విద్యార్థులు

రాచర్ల: క్రీడలు మానసిక వికాసాన్ని కలిగిస్తాయని స్పందన విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక స్పందన స్కూల్లో రెండో రోజు గురువారం స్పోర్ట్స్ ఫెస్ట్ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించేందుకు క్రీడలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పేర్ల సుస్మితారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

31న జార్జి ఫార్మసి కాలేజ్‌లో క్యాంపస్ డ్రైవ్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

మార్కాపురం: ఈనెల 31న మార్కాపురం పట్టణంలోని జార్జి ఫార్మసి కళాశాలలో దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ తెలిపారు. గురువారం క్యాంపస్ డ్రైవ్ వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. 2021 నుంచి 2024 మధ్య ఉత్తీర్ణులైన బీ ఫార్మసి, ఎం ఫార్మసి, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్‌సీ, బీటెక్ విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొనేందుకు అర్హులని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.రాజా జయరావు, డీన్ డాక్టర్ సునీత, డాక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.